
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 28 । జూలై । 2023



కాలేయాన్ని కాపాడుకుందాం
మానవ శరీరంలో ముఖ్య అవయవం కాలేయం! ఈ భాగాన్ని తీవ్ర ఇబ్బంది పెట్టే సమస్య హెపటైటిస్. 8లో



వసతి గృహాల్లో సదస్సులు
ఎస్సీ బాలికల వసతి గృహం, జీసీ బాలికల వసతి గృహాల్లో గురువారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. 8లో



స్వచ్ఛతలో టాప్ లేపుదాం
జీవీఎంసీ మరోసారి నగర కీర్తి పతాక ఎగరేసేందుకు సిద్ధమవుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానం సాధనకు కృషిచేస్తోంది. 12లో

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల ఒకటో తేదీన ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు విశాఖ వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసే ప్రాంతాన్ని అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో పారిశుధ్యం, లైటింగ్ తదితర పనులపై దృష్టి కేంద్రీకరించాలని, రోడ్డుకిరువైపులా పిచ్చి మొక్కలు, నిరుపయోగంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ట్రైనీ కలెక్టర్ స్మారన్ రాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికా అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, పర్యవేక్షక ఇంజనీరు వేణుగోపాల్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక




పాండవ మణికంఠ ముసినాడ నితీష్

సీతంపేట : అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు అక్కయ్యపాలెంకు చెందిన పదో తరగతి విద్యార్థులు ముసినాడ నితీష్, పాండవ మణికంఠ ఎంపికయ్యారు. ఆగస్టు ఒకటి నుంచి ఆరో తేదీ వరకు దుబాయ్‌లో జరగనున్న ఈ పోటీలకు రాష్ట్రం నుంచి వీరిద్దరూ ఎంపికైనట్లు కోచ్ చిట్టిబాబు, మణికంఠ తల్లిదండ్రులు పాండవ ఈశ్వరరావు, శోభ తెలిపారు. గత మే నెల 26 నుంచి 28 తేదీల్లో ఢిల్లీలో భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా దుబాయ్ మల్టిపల్ గేమ్స్-2023 పోటీలకు వీరిని ఎంపిక చేశారని నితీష్ తల్లిదండ్రులు త్రినాథ్, సుమధుర తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల బంధువులు, స్నేహితులు, సహచర విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున అభినందనలు అందుకున్నారు.

పోలీస్ యూనిట్ ఆస్పత్రిలో హోమియోపతి వైద్యసేవలు



పోలీస్ యూనిట్ ఆస్పత్రిలో హోమియోపతి వైద్యుడు ఎండీ వెంకటేష్

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ చొరవతో పోలీస్ యూనిట్ ఆస్పత్రిలో హోమియోపతి వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఈ ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ వైద్యులు మాత్రమే ఉండగా.. తాజాగా హోమియోపతి వైద్య సేవల కోసం ఎండీ(హెచ్) డాక్టర్ కె.వెంకటేష్‌ను నియమించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రతి మంగళ, బుధవారాలు హోమియోపతి వైద్య సేవలు అందించనున్నారు. దీనిపై పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో రీ డెవలప్‌మెంట్ పనుల పరిశీలన



రైల్వేస్టేషన్ బయట పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం: డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. పలు స్టాళ్లను, వెయిటింగ్ హాల్స్, ఏసీ రిలాక్సింగ్ లాంజ్, ఫుడ్ కోర్ట్స్, వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్ స్టాళ్లను పరిశీలించారు. కోచ్‌ల నిర్వహణ, పరిశుభ్రత అంశాలపై ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. జ్ఞానాపురం వైపు జరుగుతున్న స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులను పరిశీలించారు. ఈ పర్యటనలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సాయిరాజ్ పాల్గొన్నారు.

కైలాసగిరిపై సైన్స్ సిటీ..!



- రూ.4.69 కోట్ల ప్రాజెక్టుకు వీఎంఆర్‌డీఏ ప్రణాళికలు
- కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆమోదం
- మ్యూజియం గ్రాంట్ స్కీమ్ కింద రూ.3.75 కోట్లు కేటాయింపు
- మిగిలిన మొత్తాన్ని మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కోల్‌కతా సైన్స్ సిటీ సహకారంతో ఏర్పాటుకు సమాలోచనలు



కైలాసగిరిపై ఏర్పాటు చేయనున్న సైన్స్ సిటీ నమూనా

దొండపర్తి : ఆధ్యాత్మిక ఝరిగా.. పర్యాటక సిరిగా.. శోభాయమానంగా వెలుగులీనుతున్న కైలాసగిరి శాస్త్రీయ విజ్ఞానానికి వేదికగా మారనుంది. విశాఖ సిగలో ప్రపంచ పర్యాటకానికి మరిన్ని వన్నెలద్దుతూ అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి మార్గం సుగమమైంది. ప్లానిటోరియం ప్రాజెక్టులో భాగంగా రూపొందించిన సైన్స్ సిటీ ప్రాజెక్టు ప్రతిపాదనలకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆమోద ముద్ర వేసింది. రూ.4.69 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మ్యూజియం గ్రాంట్ స్కీమ్ కింద గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం ప్రాజెక్టు విలువలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ.3.75 కోట్లు కేటాయించింది. మిగిలిన రూ.94 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సముద్ర మట్టానికి 110 మీటర్ల ఎత్తులో..

అందాల విశాఖ నగరానికి వచ్చే ప్రతి సందర్శకుడూ కైలాసగిరికి వెళుతుంటారు. విదేశాల నుంచి వచ్చే 10 మంది పర్యాటకుల్లో ఎనిమిది మంది కైలాసగిరిని సందర్శిస్తుంటారని పర్యాటక శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గిరిపై నుంచి చూస్తే సాగర నగరి సొగసులు, వయ్యారాలు ఒలకబోస్తున్న తీరం సోయగాలు చూసేందుకు పర్యాటకుల ఉవ్విళ్లూరుతారు. టూరిజం ఐకాన్‌గా కైలాసగిరిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ పూర్తి స్థాయి ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సముద్ర మట్టానికి 110 మీటర్ల ఎత్తులో ఉన్న కైలాసగిరిపై సరికొత్త అనుభూతిని అందించడంతో పాటు సాంకేతిక, శాస్త్రీయ విజ్ఞాన కేంద్రం ద్వారా పర్యాటకులను అబ్బురపరిచే విధంగా ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు.

సైన్స్‌పై అవగాహన కోసం..

ప్లానిటోరియం ప్రాజెక్టులో భాగంగా సైన్స్ సిటీ ఏర్పాటు చేసేందుకు వీఎంఆర్‌డీఏ సిద్ధమవుతోంది. పిల్లల్లో సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఉపకరించే అనేక అంశాలను దానిలో అంతర్భాగం చేసే విధంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలు, అంతరిక్ష పరిశోధన, అధునాతన రాకెట్ మోడల్స్, పవన శక్తి, భూగోళం తదితర శాస్త్ర, సాంకేతిక అంశాలతో దీనిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీనిలో ఆయా శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించిన పెవిలియన్లు, ఇండోర్, ఔట్‌డోర్ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసి పాఠశాలల విద్యార్థులు, సైన్స్, పరిశోధనలపై అభిరుచి ఉన్నవారిని ప్రోత్సహించే విధంగా ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నారు.

త్వరలోనే ప్రాజెక్టు పనులు

సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి రూ.4.69 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాస్తవానికి ప్లానిటోరియంలో భాగంగా ఈ సైన్స్ సిటీని ఏర్పాటు చేయాలని అధికారులు ముందు భావించారు. దీనికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సైతం తయారు చేశారు. అయితే సైన్స్ సిటీకి కేంద్రం నిధులు మంజూరు చేస్తుండడంతో ముందుగా దీన్ని అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. కోల్‌కతా, మంగుళూరులోని పిలుకుల ప్రాంతీయ సైన్స్ సెంటర్ తరహాలో దీన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. వీఎంఆర్‌డీఏ రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్రం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

స్థాయీ సంఘంలో అన్ని అంశాలు ఆమోదం



సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న చైర్‌పర్సన్ హరివెంకటకుమారి, సభ్యులు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ స్థాయీ సంఘంలో అన్ని అంశాలూ ఆమోదం పొందాయని స్థాయీ సంఘం చైర్‌పర్సన్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి చెప్పారు. స్థాయీ సంఘ సమావేశం గురువారం మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. 39 అంశాలు, ఒక టేబుల్ అజెండా కలిపి మొత్తం 40 అంశాలు స్థాయీ సభ్యుల ఆమోదానికి వచ్చాయి. వాటిని చర్చించిన అనంతరం సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.5.19 కోట్ల పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు పనులు, అదనపు పారిశుద్ధ్య కార్మికుల ఏర్పాటు, వీధి కుక్కల నియంత్రణ, గన్‌మెన్‌ల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి సుమారు రూ.1.30 కోట్లకు సభ్యులు ఆమోదం తెలిపారని మేయర్ చెప్పారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపుతో పాటు తదితర అంశాలు ఆమోదించారన్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులు అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకుటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్లా లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీసౌజన్యతో పాటు పట్టణ ప్రణాళికా అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్ సింహాచలం, సిటీ వెటర్నరీ డాక్టర్ కిషోర్, ఏఎంఓహెచ్‌లు డాక్టర్ రాజేష్, డాక్టర్ సునీల్, పరిపాలన విభాగం ఏవో పద్మజ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కొనియాడారు. గురువారం మద్దిలపాలెంలో జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కేవీ బాబా ఆధ్వర్యంలో కలాం వర్ధంతిని నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలా గురువులు మాట్లాడుతూ భారత రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం అందించిన సేవలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కేవీ బాబా మాట్లాడుతూ శాస్త్రవేత్తగా బాలిస్టిక్ క్షిపణి, వాహన ప్రయోగ టెక్నాలజీ అభివృద్ధికి కలాం కృషి చేశారని తెలిపారు. 1998లో భారతదేశ పోఖ్రాన్-ll అణు పరీక్షలలో కీలకమైన, సంస్థాగత, సాంకేతిక, రాజకీయ పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లంపల్లి రాజబాబు, పేర్ల విజయ్ చందర్, అద్దాల కృపా జ్యోతి , బోని శివరామకృష్ణ, మన్యాల శ్రీనివాస్, పెంఢ్ర అప్పన్న, కే.రామన్న పాత్రుడు, పద్మావతి, చొక్కర శేఖర్, వెంకట రమణా రెడ్డి, మధు సంపతి, పీవీ నారాయణ, రమేష్, వెంకట రావు, భాను పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌ను వినియోగించుకోండి

అల్లిపురం: ఏపీఎస్‌ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌ను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ కోరారు. ఆర్టీసీ జోన్-1 పరిధిలో పార్సిల్ బుకింగ్ ఆరు జిల్లాల ఏజెంట్లతో ఆయన గురువారం ఎంవీపీ కాంప్లెక్స్‌లో క్యాంప్ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏజెంట్లు రెవెన్యూ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, విశాఖపట్నం ఏటీఎంసీ బాపిరాజు, విజయనగరం ఏటీఎంసీ హెచ్.దివ్య, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ స్పెషల్ టూర్ ప్యాకేజీలు



వివరాలు వెల్లడిస్తున్న క్రాంతి సావర్కర్

తాటిచెట్లపాలెం : పుణ్యక్షేత్రాల సందర్శించాలనుకునే భక్తులు, పర్యాటకుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం, దుర్గాపూజ సందర్భంగా ఈ ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో ఎల్‌టీసీ, ఎల్ఎఫ్‌సీ వంటి సదుపాయాలు కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆమెతో పాటు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్(భువనేశ్వర్) సంఘమిత్ర, ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్‌బిసా పాల్గొన్నారు.

తిరుపతి బాలాజీ దర్శన్

ఈ టూర్ మొత్తం 2 రాత్రులు, 3 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ సెప్టెంబరు 2, 20, అక్టోబరు 28, నవంబరు 4, డిసెంబరు 9 తేదీల్లో విశాఖపట్నంలో ప్రారంభమవుతుంది. ఈ టూర్‌లో తిరుమల, తిరుచానూర్, కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం ప్రాంతాలను దర్శించవచ్చు. ఈ టూర్ ప్రారంభం రూ.16,275(ఒక్కొక్కరికి)

సదరన్ డివైన్ టెంపుల్ టూర్

ఈ యాత్ర మొత్తం 5 రాత్రులు, 6 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ సెప్టెంబరు 15వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమై సెప్టెంబరు 20వ తేదీన విశాఖపట్నంలో ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ గుడి, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలో గల వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయం వంటి దర్శనీయ స్థలాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒకొక్కరికి రూ. 34,480 చార్జీ చేస్తారు.

చార్‌దామ్ యాత్ర

ఈ టూర్ మొత్తం 11 రాత్రులు, 12 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ సెప్టెంబరు 16న విశాఖపట్నంలో ప్రారంభమై విశాఖపట్నంలో ముగుస్తుంది. ఈ టూర్‌లో ప్రముఖ క్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి వంటి ప్రాంతాలను సందర్శించవచ్చు. ఈ టూర్ ప్రారంభ ధర రూ.53,630

మెస్మరైజింగ్ కేరళ

ఈ యాత్ర మొత్తం 5 రాత్రులు, 6 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ అక్టోబరు 14న విశాఖలో ప్రారంభమై 19న విశాఖలో ముగుస్తుంది. ఈ టూర్‌లో కేరళలోని కొచ్చిలో గల డచ్ ప్యాలెస్, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్, శాంతా క్రూజ్ బాసిలికా, మున్నార్‌లో గల ఎరవికుళం నేషనల్ పార్క్, టీ మ్యూజియం, మట్టుపెట్టి డ్యాం, ఈకో పాయింట్, కుండల డ్యాం లేక్, అలెప్పీలోని హౌస్‌బోట్‌లో రాత్రి బస, త్రివేండ్రలో అజిమల టెంపుల్, శ్రీ పద్మనాబ టెంపుల్ వంటి ప్రఖ్యాత సందర్శనీయ స్థలాలను వీక్షించవచ్చు. ఒక్కొక్కరికి రూ.38,110 నుంచి ప్రారంభం.

సిక్కిం, గాంగ్‌టక్, డార్జిలింగ్

ఈ టూర్ మొత్తం 6 రాత్రులు, 7పగళ్లు ఉంటుంది. ఈ టూర్ నవంబరు 28వ తేదీన విశాఖపట్నం ప్రారంభమవుతుంది. ఈ టూర్‌లో ఒక్కొక్కరికి రూ.48180 నుంచి ప్రారంభం.

ఇవేకాకుండా ప్రతీ వారాంతంలో మూడు రాత్రులు, 4పగళ్లు తిరుపతికి ప్రత్యేక రైలు ప్యాకేజీలు కూడా నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ చంద్రమోహన్ బిసా తెలిపారు. ఈ ప్యాకేజీలో కూడా తిరుమల, తిరుచానూరు, కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీనివాసమంగాపురం ప్రాంతాలను దర్శించవచ్చని పేర్కొన్నారు. ఈ ప్యాకేజీ ఒక్కొక్కరికి రూ.10,280 నుంచి ప్రారంభమవుతుంది. మరిన్ని వివరాలకు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా 82879 32318, 7978127004, 8287932225 నెంబర్లలో గానీ సంప్రదించాలని ఏరియా ఆఫీసర్ చంద్రమోహన్ కోరారు.

విదేశీ కల విద్యా దీవెనతో సాకారం

- 21 మందికి రూ.3.37 కోట్లు అందజేత
- కల నెరవేరిందని విద్యార్థుల ఆనందం



విద్యార్థులకు మెగా చెక్కును అందిస్తున్న జేసీ విశ్వనాథన్, ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఎమ్మెల్సీలు కల్యాణి, రవీంద్రబాబు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు

సాక్షి, విశాఖపట్నం : ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల విదేశీ చదువుల కలని ప్రభుత్వం నెరవేరుస్తోంది. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి విద్యార్థికి ఆపన్న హస్తం అందిస్తోంది. వరుసగా రెండో ఏడాది జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా విశాఖ జిల్లాకు సంబంధించి 2023లో జగనన్న విదేశీ విద్యా దీవెనకు అర్హులైన ఐదుగురికి రూ.80,55,411, 2022లో అర్హులైన 16 మందికి రెండో విడతగా రూ.2,57,36,834 చొప్పున మొత్తం రూ.3,37,92, 245 సాయం అందజేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో అర్హులైన 21 మంది విద్యార్థులకు మెగా చెక్కు రూపంలో ప్రజా ప్రతినిధులతో కలిసి జేసీ అందజేశారు. ఈ సందర్భంగా జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల విద్యార్థుల కలలు సాకారం చేసేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పథకానికి అర్హులైన వారందరికి ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసినట్లు వివరించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఈ విదేశీ విద్యా దీవెన పథకాన్ని వినియోగించుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, నగరాల చైర్‌పర్సన్ పిల్లా సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రామారావు, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, జిల్లా అల్పసంఖ్యాకుల సంక్షేమాధికారి ఎమ్ఏ రహీమ్, కార్పొరేటర్లు ఫరూఖ్, షరీఫ్, సాధిఖ్, బర్కత్ అలీతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాస్టర్స్ సీటుకు ఆర్థిక సాయమందించారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబ సభ్యుడిలా ఆలోచిస్తున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన సంక్షేమ పథకాల్ని ప్రవేశపెడుతున్నారు. కార్నిగీ మెల్లాన్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుకోవటానికి సీటు వచ్చింది. అయితే దానికి రూ.80 లక్షల వరకూ ఖర్చవుతాయి. ఇంట్లో పరిస్థితి అంతంత మాత్రమే. ఏం చేయాలో తోచని సమయంలో విదేశీ విద్యా దీవెన పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. రెండు విడతల్లో రూ.80 లక్షలు అందించారు. మా కుటుంబమంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎ.వెంకట శుభ అనీష్, అక్కయ్యపాలెం

థ్యాంక్యూ సీఎం జగన్ సార్



ఉన్నత విద్య అభ్యసించాలని నాకు చిన్నప్పటి నుంచి కోరిక ఉండేది. కానీ ఇంట్లో పరిస్థితులు ఎప్పటికప్పుడు ఆలోచనల్లో పడేశాయి. ఇక అది కలగానే మిగిలిపోతుందని అనుకున్నాను. మధ్యతరగతి కుటుంబాలకు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవడం సాధ్యం కాదని ఆశలు వదులుకున్నాను. కానీ జగనన్న ప్రవేశ పెట్టిన ఈ పథకం వల్ల నా కల నెరవేరింది. ప్రస్తుతం ఈ పథకం వల్ల అందిన సాయంతో న్యూయార్క్ యూనివర్సిటీలో మాస్టర్స్‌లో చేరబోతున్నాను. తీరదనుకున్న నా కలని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారు. థాంక్యూ సీఎం సార్.

– సీహెచ్ లక్ష్మీకిరణ్మయి, మాధవధార

మానసిక ఆస్పత్రిలో నగదు రహిత సేవలు



రోగి బంధువులకు రశీదు అందిస్తున్న సూపరింటెండెంట్ కె.వి.రామిరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో నగదు రహిత యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆస్పత్రిలో వైద్యం, మందులు, భోజనం ఉచితంగా అందిస్తున్నామన్నారు. వ్యాధి నయమైన తరువాత రోగి, బంధువులు ఇంటికి తిరిగి వెళ్లడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడడం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిలో రోగిని చేర్చుకునే సమయంలో రవాణా చార్జీల(టికెట్ చార్జీలు) నిమిత్తం కొంత సొమ్ము జమ చేసుకుని రశీదు ఇస్తామని, డిశ్చార్జ్ సమయంలో ఈ మొత్తం తిరిగి ఇవ్వనున్నామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రోగులకు ఉపయుక్తంగా నగదు రహిత యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

ఓటరు జాబితా సవరణపై జేసీ సమీక్ష

అల్లిపురం: ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ గురువారం సాయంత్రం ఈఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ఈఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

శిథిల భవనాల్లో ఉండొద్దు

డాబాగార్డెన్స్: విశాఖలో ఐదు రోజులుగా కురిసిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచించారు. ముఖ్యంగా శిథిల భవనాల్లో నివాసం ఉండొద్దని హెచ్చరించారు. జోన్-4 పరిధి పాత నగరంలో అధికంగా శిథిల భవనాలున్నాయని, బుధవారం కురిసిన భారీ వర్షానికి అతియో-వహెబ్ భవనం, ఇసుక కొండపైన మరో భవనం కూలిపోయాయన్నారు. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా శిథిల భవనాల్లో నివశించే ఇంటి యజమానులందరికీ, నివాసితులకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసిందన్నారు. శిథిల భవనాల్లో ఉన్నవారు స్వచ్ఛందంగా ఆ భవనాలను ఖాళీ చేసి, ఆ భవనాలు తొలగించాలన్నారు.

ఏయూ రీసెర్చ్ అధికారికి అంతర్జాతీయ ఫెలోషిప్



అనింధ్యరాయ్‌ని అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్‌లో రీసెర్చ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ అనింధ్య రాయ్ చౌదరి ప్రతిష్టాత్మక వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్(డబ్ల్యూఐపీవో) ఫెలోషిప్‌కి ఎంపికయ్యారు. ఈ సంస్థ ఐపీ సేవలు, ఐపీ పాలసీ, సమాచారం, సహకారం తదితర అంశాలలో పని చేస్తోంది. సౌత్ ఆఫ్రికాకు చెందిన నేషనల్ ఐపీ మేనేజ్‌మెంట్ ఆఫీస్ ఈ నెల 31 నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు డర్బన్‌లో నిర్వహించే ప్రత్యేకమైన ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంలో ఈ రీసెర్చ్ ఫెలో సాధించిన డాక్టర్ అనింధ్య రాయ్ చౌదరి పాల్గొంటారు. ప్రపంచ వ్యాప్తంగా 19 దేశాల నుంచి మేధో హక్కుల నిపుణులు ఈ సదస్సులో భాగస్వాములవుతున్నారు. ఈ సందర్భంగా అనింధ్యరాయ్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వసతి గృహాల్లో అవగాహన సదస్సులు

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ బాలికల వసతి గృహం, బీసీ బాలికల వసతి గృహాల్లో గురువారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ యాసిడ్ బాధితులకు చట్టపరమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సమత, సింధు, తనూజ, శిరీష, నర్మదా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,460
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,450
వెండి(కిలో):	రూ.81,500

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	475.00
విజయనగరం	479.00
శ్రీకాకుళం	479.00

కాలేయాన్ని కాపాడుకుందాం

మానవ శరీరంలో ఐదు వందలకు పైగా జీవక్రియల్లో పాల్గొనే ముఖ్య అవయవం.. కాలేయం! ఈ భాగాన్ని తీవ్ర ఇబ్బంది పెట్టే సమస్య హెపటైటిస్. ఇన్‌ఫెక్షన్లు, ఆల్కహాల్ వంటి దురలవాట్లు, జన్యుపరమైన లోపాలు, ఔషధాల దుష్ప్రభావాలు.. తదితర కారణాలతో హెపటైటిస్ సంక్రమించవచ్చు. తొలిదశలోనే గుర్తిస్తే ఇబ్బంది లేదు. ఆలస్యం అయినకొద్దీ ప్రమాదమే! ఏటా జూలై 28న 'ప్రపంచ హెపటైటిస్ డే' జరుపుకొంటాం. –మహారాణిపేట

- ముందుజాగ్రత్త అవసరం
- అవగాహన ఉండాలి
- వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల హైపటైటిస్
- కేజీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలు
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



ప్రాథమికంగా హెపటైటిస్ అన్నది వైరస్ వల్ల వచ్చే కాలేయ సంబంధ వ్యాధి. ఈ వైరస్‌లో ఏ,బీ,సీ, డీ,ఈ అనే ఐదు రకాలు ఉన్నాయి. ఇవి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. ఏదో ఓ మార్గంలో మనిషి శరీరంలో ప్రవేశించి కాలేయాన్ని చేరుకొంటాయి. క్రమంగా ఆ భాగాన్ని శక్తిహీనం చేస్తాయి. హెపటైటిస్–ఎ, హెపటైటిస్–ఇ వైరస్‌లు కలుషిత నీరు, కలుషిత ఆహారం ద్వారా సంక్రమిస్తాయి. ఒళ్లు నొప్పులు, తేలికపాటి జ్వరం, తలనొప్పి, నిస్సత్తువ ప్రధాన లక్షణాలు. ఆ తర్వాత, రెండుమూడు రోజుల్లో పచ్చ కామెర్లు బయటపడుతాయి. హెపటైటిస్ వైరస్‌వల్ల లివర్ కణజాలం దెబ్బతినటంతో సంభవించే పరిణామం ఇది. చాలా సందర్భాల్లో ఎల్‌ఎఫ్‌టీ వంటి రక్త పరీక్షలు, సీరలాజికల్ పరీక్షలతో వైరస్‌ను గుర్తించవచ్చు. శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసుకోవడం ద్వారా రుగ్మత అదుపులోకి వస్తుంది. కొన్ని అరుదైన సందర్భాల్లో హెపటైటిస్–ఎ, హెపటైటిస్–ఇ వైరస్‌ల కారణంగా కాలేయానికి తీవ్ర ఇబ్బందులు వస్తాయి. దీన్ని 'ఫల్మనెంట్ హెపటైటిస్' అని పిలుస్తారు. ఇటువంటి సందర్భాల్లో వెంటనే రోగిని ఆసుపత్రిలో చేర్చాలి. ఐసీయూ చికిత్స తప్పనిసరి కావచ్చు. రెండో రకం అయిన.. హెపటైటిస్–బి, హెపటైటిస్–సి మరింత ప్రమాదకరం. సాధారణంగా శరీర ద్రవాల ద్వారా (లాలాజలం, రక్తం వంటివి) ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తాయి. అదే విధంగా ఇన్‌ఫెక్టెడ్ సిరంజీలు, నీడిల్స్ వంటివాటితోనూ సంక్రమించే ఆస్కారం ఉంది. చాలా మందిలో వైరస్ వ్యాపించిన తర్వాత కూడా, ఎటువంటి రోగ లక్షణాలూ బయటపడక పోవచ్చు. కొందరిని మాత్రం తీవ్రమైన కడుపు నొప్పి, పచ్చ కామెర్లు వెంటాడుతాయి. అయితే, ఎలాంటి వ్యాధి లక్షణాలూ లేకపోయినా హెపటైటిస్–బి, హెపటైటిస్–సి ఇన్‌ఫెక్షన్లు ఒక్కసారి మొదలైతే మాత్రం.. లివర్‌లోని కణజాలాన్ని క్రమంగా శిథిల పరుస్తాయి. ఫలితంగా కాలేయం పనితీరు దెబ్బతింటుంది. ఇది క్రమంగా లివర్ సిర్రోసిస్ (అంటే, లివర్‌లోని కొంత కణజాలం నిర్జీవ స్థితికి చేరిపోవడం)కు దారి తీస్తుంది. ఈ పరిస్థితిలో బరువు తగ్గటం, పచ్చ కామెర్లు, కడుపులో నీరు చేరటం, రక్తపు వాంతులు తదితర విపరీత లక్షణాలు కనిపిస్తాయి. డీఎన్‌ఏ లేదా ఆర్‌ఎన్‌ఏ రక్త పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. లివర్ లోపాలవల్ల కలిగే ఇబ్బందిని గుర్తించేందుకు అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీటీ స్కాన్ అవసరం అవుతాయి. ఈ వైరస్‌లను సకాలంలో గుర్తిస్తే మందులతోనే నియంత్రించవచ్చు. ఇతర అనర్థాలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

నేడు లివర్ వాక్

ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌కె.బీచ్‌లో లివర్ వాక్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆర్.కె.బీచ్‌లో జరిగే లివర్ వాక్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ ప్రారంభిస్తారు. 'ఒకే జీవితం, ఒక కాలేయం' అనే నినాదంతో 'లివర్ వాక్'ను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉచిత స్క్రీనింగ్ క్యాంపెయిన్లు, అవగాహన కార్యక్రమాలు, ఫ్లాష్ మాబ్ నిర్వహించనున్నారు.

కేజీహెచ్‌లో మూడు రోజులు సేవలు

కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు అవుట్ పేషంట్ విభాగం పనిచేస్తోంది. సోమవారం లివర్ (కాలేయ) వ్యాధుల ఓపీ, బుధవారం, శనివారం గ్యాస్ట్రో ఎంటరాలజీ, అనేక రకాల హెపటైటిస్ రోగులకు సేవలు అందిస్తామని కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్ చెప్పారు. పై రోజుల్లో ఓపీకి 30 నుంచి 40 మంది వరకు వస్తారన్నారు.

ఇప్పటి వరకు 9వేల మందికి సేవలు



2008లో ప్రారంభ దశలో హెచ్‌ఏబీతఈబీ ప్రాజెక్టును గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి దివంగత డాక్టర్ పి.మురళీకృష్ణ చేపట్టారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, మెంటల్ హెల్త్ హాస్పిటల్, ఛాతీ ఆస్పత్రి, ఈఎన్‌టీ, కేజీహెచ్ అనుబంధంగా ఉన్న అనేక ఇతర ప్రభుత్వ ఆస్పత్రులలో 20 ఏళ్ల వయస్సు ఉన్న 18 వేల మందికి పైగా టీకాలు వేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం, మైక్రోబయాలజీ విభాగాలు సంయుక్తంగా ప్రతి బుధవారం ఉచిత వ్యాక్సినేషన్ ఇస్తున్నారు. హైపటైటిస్ వ్యాధి సోకిన వారికి ఉచితంగా మందులు ఇస్తున్నాం. ఇప్పటివరకు తొమ్మిది వేల మందికి పైగా వైద్య సేవలు పొందారు.

–డాక్టర్ ఎల్‌ఆర్‌ఎస్ గిరినాథ్, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి కేజీహెచ్, విశాఖపట్నం

నిధులిస్తున్నా.. రోడ్లు బాగు చేయరా?

- కారుకు ఉన్న నేమ్ బోర్డు తీసి తిరిగేలా చేయొద్దు
- కొంత మంది అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు
- స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో శ్రీరామమూర్తి

మహారాణిపేట: గ్రామీణ రహదారుల గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఎందుకు పనులు చేపట్టడం లేదని అధికారులపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని, కొన్ని ప్రాంతాల్లో తన కారుకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పేరుతో ఉన్న బోర్డును తొలగించి తిరగాల్సి వస్తోందని చెప్పారు. వడ్డాది నుంచి మన్యం వరకు ఘాట్ రోడ్డు గుంతలతో నిండిపోయిందన్నారు. వారంలో రెండు రోజుల పాటు ఈ మార్గంలో తాను తిరుగుతున్నట్టు చెప్పారు. రోడ్ల సమస్యను అనకాపల్లి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వచ్చే నెల 19న జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోగా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు.

ప్రొటోకాల్‌పై సీఎంకు లేఖ

ప్రొటోకాల్ పాటించని అధికారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాస్తామని సుభద్ర తెలిపారు. తొలుత భీమిలిలో ఇటీవల జరిగిన కేజీబీవీ పాఠశాల ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించలేదని జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ స్పందిస్తూ జిల్లాలో జరిగే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సమయంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. ఈ విషయాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. విశాఖ, అనకాపల్లి, ఏఎస్‌ఆర్ జిల్లాల అధికారులు కూడా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా పిలవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు అందుతున్నాయని జె.సుభద్ర తెలిపారు. ఇటీవల తనను పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కోరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల జెడ్పీ కార్యాలయ ఉద్యోగికి గుండెనొప్పి రావడంతో కేజీహెచ్‌లో చేరారని, వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ఆయన పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సర్కారు వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడు కింద కార్పొరేట్ ఆస్పత్రులుగా తీర్చిదిద్దారని చెప్పారు. దీంతో పీహెచ్‌సీలకు రోగులు పెద్ద సంఖ్యలో వెళ్తున్నారన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలలకు భవనాల నిర్మాణంతో పాటు భాషా పండితులను నియమించాలని సుభద్ర కోరారు. దీనిపై డీఈవో చంద్రకళ స్పందిస్తూ 940 పాఠశాలలకు భవనాలు నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వ అనుమతి కోసం పంపామన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు కండ్ల కలకతో ఇబ్బంది పడుతున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. 5వ సంఘ చైర్మన్ ఈర్లె అనురాధ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం లేదా ఐటీడీఏ నిధులతో గానీ మండలాల్లో అసంపూర్తిగా ఉన్న వివిధ భవనాలను పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో పి.శ్రీరామమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి డి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు, మూడు జిల్లాల అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బంగ్లాదేశ్ యువకులు

గోపాలపట్నం: సాక్స్‌లో బటన్ చాక్ పెట్టి ప్రయాణిస్తున్న నలుగురు బంగ్లాదేశ్ యువకులను విశాఖ ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన నుంచి నలుగురు యువకులు కలకత్తా నుంచి విశాఖ మీదుగా చెన్నై వెళ్లేందుకు విమానంలో బయలుదేరారు. అందులో ఒక వ్యక్తి వద్ద బటన్ చాక్‌ను విశాఖ ఎయిర్‌పోర్టులో సీఐఎస్‌ఎఫ్ జవాన్లు గుర్తించారు. దీంతో ఆ యువకుడుతో పాటు మిగతా ముగ్గురిని ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఎయిర్‌పోర్టులో ఆ యువకుల్ని విచారిస్తున్నారు. యువకులు చెన్నైలో వైద్యం చేయించుకునేందుకు బంగ్లాదేశ్ నుంచి బయలుదేరారు. ఓ యువకుని వద్ద బ్యాగ్‌లో కొన్ని ఏళ్లుగా బటన్ చాక్ ఉంది. కలకత్తా ఎయిర్‌పోర్టులో ఇది గమనించిన యువకుడు బ్యాగ్ నుంచి తీసి సాక్స్‌లో పెట్టాడు. ఈ చాక్ విశాఖ ఎయిర్‌పోర్టులో దొరికింది. అయితే సాక్స్‌లో చాక్ ఎందుకు పెట్టాడు? మెడికల్ కోసం వచ్చిన వారు చాక్ ఎందుకు తీసుకురావల్సి వచ్చిందన్న కోణంలో విచారిస్తున్నారు. అయితే ఎయిర్‌పోర్టు పోలీసులు దీనిపై పూర్తి వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు.

విదేశీ యువతిని వేధించిన ఆటోడ్రైవర్‌పై కేసు

ఎంవీపీకాలనీ: విదేశీ యువతిని వేధించిన ఆటోడ్రైవర్‌పై ఎంవీపీ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆఫ్రికాలోని బోట్స్వానా దేశానికి చెందిన కారేనా క్వాట్లహోవు (23) ఏయూలో బీ ఫార్మసీ చదువుతుండగా ఎంవీపీ కాలనీలోని హాస్టల్‌లో ఉంటోంది. గురువారం ఉదయం సమత కళాశాల దరి ఓ జిమ్‌కు వెళ్లిన యువతి అనంతరం సెక్టార్–6లోని స్మార్ట్‌పాయింట్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆ సమయంలో నగరానికి చెందిన ఆటో డ్రైవర్ సురేష్ ఆటోను నెమ్మదిగా ముందుకు పోనిస్తూ ఆమెను తాకే ప్రయత్నం చేస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె గట్టిగా అరవడంతో స్థానికులు ఆటో ఆపి అతన్ని మందలించారు. బీచ్‌లో ఆటో ఎక్కించుకున్నానని తనకు రూ.250 ఇవ్వాలని చెప్పగా.. అతను అబద్ధం చెబుతున్నట్లు ఆ యువతి వివరించింది. తరువాత కూడా ఆమెను వెంబడిస్తూ తనకు రూ.250 చెల్లించాలంటూ వాదించాడు. అతని ప్రవర్తనకు ఆమె భయపడి ఓ ఫార్మసీలోకి వెళ్లింది. స్థానికులు విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దివ్యజ్యోతి వెల్లడించారు.

భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం



మాధవి (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు నక్కా గోవింద్, మాధవి వెళుతుండగా అదుపుతప్పడంతో మహిళ ట్రాలర్ చక్రాల కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాల్‌రెడ్డి నగర్‌కు చెందిన నక్కా గోవింద్, మాధవి గురువారం సాయంత్రం అగనంపూడి నుంచి గోపాల్‌రెడ్డినగర్‌కు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. గాజువాక జగ్గు జంక్షన్‌లో ట్రాలర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పింది. వెనుక కూర్చున్న మాధవి (26) అదుపుతప్పి ట్రాలర్ వెనుక చక్రాల కింద పడిపోయింది. ఆమె తలపైనుంచి చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామని, ట్రాలర్ డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నట్టు ఎస్‌ఐ సతీష్ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళల అక్రమ రవాణాను అరికట్టాలి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖ –లీగల్: మహిళలు, యువతుల అక్రమ రవాణాను అరికట్టాలని విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ సూచించారు. గురువారం సాయంత్రం జిల్లా కోర్టులోని లోక్‌అదాలత్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల అక్రమ రవాణా, అప్రమత్తత, చేపట్టవలసిన చర్యలపై న్యాయమూర్తి ప్రసంగించారు. నిరక్షరాస్యులు, ఇంటి పరిస్థితులు, ఇతర సమస్యలతో పలువురు అక్రమ రవాణాకు గురవుతున్నట్టు చెప్పారు. వీటిపై పోలీసులు, శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని, విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.వెంకటేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న మహిళల అక్రమ కేసుల్లో 90.9% వరకు రికవరీ అవుతున్నట్లు చెప్పారు. దిశా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.నిర్మల మాట్లాడుతూ విశాఖలో వివిధ కారణాలవల్ల తప్పిపోయిన యువతులు, బాలలు, మహిళలు గుర్తించి వారిని తిరిగి ఇంటికి తీసుకొచ్చే విధంగా పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, పోలీస్ అధికారులు, సామాజిక, సమాంతర న్యాయ సేవ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులు విధులకు వెళ్లాలి



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులు విధులకు వెళ్లాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన తహసీల్దార్, లేబర్ ఆఫీసర్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో సంప్రదింపులు జరిపామని తెలిపారు. ఆ సమావేశంలో ప్రస్తావించిన అంశాలకు పోర్టు యాజమాన్యం కట్టుబడి ఉందని వివరించారు. వాటిని అమలు చేసేందుకు ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉందన్నారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను ఎటువంటి షరతులు లేకుండా విధుల్లోకి తీసుకుంటారన్నారు. వన్ టైం ఎక్స్‌గ్రేషియా కింద సెప్టెంబర్ జీతంతో పాటు రూ.10 వేలు యాజమాన్యం చెల్లించనుందని తెలిపారు. ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే ఆ కార్మికుని కుటుంబానికి మెడికల్ పాలసీ కింద యాజమాన్యం రూ.25 లక్షలు చెల్లిస్తుందని చెప్పారు. వెంటనే ఉద్యోగులు విధులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, పేర్ల నూకరాజు, కొవిరి అప్పలరాజు పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- పరారీలో మరొకరు..
- పాత కక్షలే కారణమా?



హత్యకు గురైన కిరణ్



బార్‌లో సిబ్బందిని విచారిస్తున్న ఏసీపీ మూర్తి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువకుడు హత్యకు గురయ్యాడు. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నారు. హత్యకు పాతకక్షలే కారణంగా తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. కైలాసపురానికి చెందిన కిరణ్ (22), రౌతు సురేష్, నందగిరినగర్‌కు చెందిన కాపు శివ, చెక్కుడురాయి బిల్డింగ్ ప్రాంతానికి చెందిన పాట్నూర్ శ్రీనివాస్ (అలియాస్ పొట్టి శ్రీను) గురువారం రాత్రి 7 గంటల సమయంలో మద్యం సేవించేందుకు తాటిచెట్లపాలెం బజారులోని విశాఖ రెస్టారెంట్ అండ్ బార్‌లోకి వచ్చారు. వీరి మధ్య గొడవ జరగ్గా శివ స్క్రూ డ్రైవ్‌తో కిరణ్‌ను పొడవడంతో అక్కడక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఈస్ట్ ఏసీపీ మూర్తి, సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్‌ఐ వెంకటరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే నిందితులు శివ, సురేష్, శ్రీనివాస్ అక్కడి నుంచి పరారయ్యారు. గాలింపు చేపట్టిన పోలీసులు సురేష్, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. శివ పరారీలో ఉన్నాడు. హత్యకు గురైన కిరణ్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు.

బార్‌లో సీసీ ఫుటేజీల పరిశీలన

ఏసీపీ మూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది బార్‌లోని సీసీ ఫుటేజీలు పరిశీలించారు. వీరు బార్‌కు ఎన్ని గంటలకు వచ్చారు? అక్కడ ఏమి జరిగింది? వీరి మధ్య గొడవకు కారణాలపైన బార్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హత్య జరిగిన సమయంలో ఇంకా అక్కడ ఎవరు ఉన్నారనే దానిపైన ఆరా తీస్తున్నారు.

గతంలో గొడవలు

ఈ నలుగురి మధ్య పాత గొడవలు ఉన్నాయి. నాలుగు నెలల క్రితం కైలాసపురం పార్కు వద్ద కిరణ్.. శివ మధ్య తగాదా జరిగింది. దీనిపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కిరణ్‌పై కేసు నమోదైంది. ఇదిలా ఉండగా శివపై గతంలో రెండు సార్లు హత్యాయత్నం జరిగింది. హత్యకు కారణాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ మూర్తి తెలిపారు. గతంలో జరిగిన గొడవలపైన విచారిస్తున్నట్లు చెప్పారు.